క్లుప్తంగా

అందరి సహకారంతో అభివృద్ధి సాధ్యం



అమరచింత: అందరి సహకారంతో అభివృద్ధి సాధ్యమని మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ కౌన్సిలర్‌లతో కలిసి ఆయన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ డీఎంఆర్ఎం ట్రస్టు ద్వార తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణం గౌడ్, కలాంపాషా, భాస్కర్ సింగ్, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో దేవరి మల్లప్ప ప్రత్యేక ప్రార్థనలు



అమరచింత: పట్టణంలోని సయ్యద్‌షా రాజవళి దర్గా షరీఫ్‌లో ఆదివారం దర్గాలో ట్రేడ్ యూనియన్ రాష్ట్ర మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం దర్గా కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు. దర్గా అభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు షానవాజ్ ఖాన్, షాహిన్ రఫి, ఖాజామైను, తౌఫిక్, ఇంతియాజ్, ఫరీద్, కలాంపాషా, మోహిన్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలమూరు జిల్లా అధ్యక్షుడికి పరామర్శ



అమరచింత: పట్టణానికి చెందిన అడ్వకేట్, మహబూబ్‌నగర్ జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి తండ్రి విశ్వనాథం చారి ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి వీరబ్రహ్మం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

ఆత్మకూర్: మండలంలోని మూలమల్ల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చంద్రన్న(72) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట అధికార ప్రతినిధి కేషం నాగరాజుగౌడ్, టీపీసీసీ సభ్యుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డిలు గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. అదేవిధంగా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సర్పంచ్ ప్రశాంతి, ఎంపీటీసీ శ్యామల, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

రోడ్డుకు మరమ్మతు



ఆత్మకూర్: పట్టణంలోని బీసీకాలనీలో రోడ్లు గుంతలమయంగా మారడంతో కాలనీవాసుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మాజీ వార్డు సభ్యుడు గడ్డమీది శ్రీనివాసులు రోడ్డుకు మరమ్మతు చేయించారు. రూ.50 వేలు వెచ్చించి కాలనీవాసులు సౌకర్యార్థం ఆదివారం మొరం మట్టి వేశారు. త్వరలోనే రూ. 30 లక్షలతో 6వవార్డులోని బీసీ కాలనీలో సీసీరోడ్ల నిర్మాణాలు చేపడుతామని ఆయన పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి చెందిన తెల్కపల్లి రాఘవేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అయ్యప్ప ధర్మ సేవా సమితి సభ్యులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.51వేల ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో చెన్నయ్య, బాలింగం, విక్రమ్, ఆంజనేయులు గౌడ్, మధుకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్లున్నా బస్సులు ఏవీ?



పరిమితికి మించి ఆటోలో వెళ్తున్న ప్రయాణికులు(ఫైల్)

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- ప్రైవేటు వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ఖిల్లాఘనపురం: వనపర్తి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాలకు ఎటుచూసిన ఖిల్లాఘనపురం 25నుంచి 30 కిలోమీటర్ల దూరంలో గుట్టల మధ్యన ఉంది. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు రోడ్లు ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సులు నడవడం లేదు. కేవలం వనపర్తి నుంచి మండలం మీదుగా మహబూబ్‌నగర్ వెళ్లే ప్రధాన రోడ్డుపై ఉన్న గ్రామాలకు మాత్రమే బస్సులు నడుపుతున్నారు. దీంతో మిగతా గ్రామాల ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలు, పలు గిరిజన తండాలు ఉన్నాయి. ప్రతి గ్రామ పంచాయతీకి ప్రభుత్వం బీటీరోడ్డును ఏర్పాటు చేశారు. ఆర్టీసీ వారు కేవలం సోళీపురం, కొత్తపల్లితండా, మానాజీపేట, ఖిల్లాఘనపురం, రోడ్డుమీదితండాల మీదుగా మహబూబ్‌నగర్‌కు బస్సులను నడుపుతున్నారు. కనీసం బీటీ రోడ్లు ఉన్న గ్రామ పంచాయతీల వరకు బస్సులు నడిపితే ఉపయోగంగా ఉంటుందని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రైవేటు వాహనాలే దిక్కు..

మండలంలో గ్రామాలు, తండాలకు ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ప్రజలకు ప్రైవేటు వాహనాలే దిక్కవుతున్నాయి. గ్రామాల్లో లైన్ పెట్టుకుని ఒక్కో ఆటోలో కనీసం 10 నుంచి 15 మంది తక్కువ కాకుండా ఎక్కించుకుని మండల కేంద్రానికి తరలిస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. ప్రమాదకరంగా వెళ్తూ ప్రమాదాలకు సైతం గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు ఆర్టీసీ బస్సులు నడిపేలా చూడాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నారు..



మండలంలో 27గ్రామ పంచాయతీలకు కేవలం నాలుగు గ్రామ పంచాయతీలకు మాత్రమే బస్సులు వస్తున్నాయి. ఉదయం సమయంలో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి ప్రైవేటు వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులు వెళ్తున్నారు. అధికారులు స్పందించి బస్సులు నడిపించాలి.

– వడ్డె భూమయ్య, ఖిల్లాఘనపురం

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

- టీపీసీసీ సభ్యుడు చింతలపల్లి జగదీశ్వర్‌రావు

పాన్‌గల్: కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమని టీపీసీసీ సభ్యులు చింతలపల్లి జగదీశ్వర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని శాగాపూర్, కదిరెపాడు గ్రామాల్లో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ అవలంభిస్తున్నా ప్రజావ్యతిరేక విధానాలను గడప, గడపకు వివరించాలన్నారు. దళిత, గిరిజనుల కుటుంబాలకు ఇస్తామన్న 3 ఎకరాల భూమి ఊసేలేదన్నారు. అధికారంలోకి వస్తే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, రూ.500లకే సిలిండర్ ఇస్తామన్నారు. వచ్చే ఎన్నికలల్లో బీఆర్ఎస్ పార్టీకి గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేసే సంక్షేమ పథకాల సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి పంచారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి....

శాగాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సింగన్నయాదవ్, మత్స్యకార సంఘం నాయకులు నర్సింహా, కుర్మయ్య, బాలస్వామి, చిన్నకృష్ణయ్యతో పాటు 20మంది మత్స్యకారులు కాంగ్రెస్‌లో చేరారు. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కృష్ణ, మండల నాయకులు నర్సింహనాయుడు స్వామి, సుధాకర్‌యాదవ్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఆదిచంద్రయ్య, రామకృష్ణ, టక్కుశ్రీను, నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.



శాగాపూర్‌లో మహిళలకు కరపత్రాలను అందజేస్తున్న సీఆర్ జగదీశ్వర్‌రావు

వెదురు వర్క్‌షాప్‌నకు మురళీకృష్ణ ఎంపిక



పెబ్బేరు: ఈ నెల 9,10 వ తేదీల్లో న్యూ ఢిల్లీలో పీహెచ్‌డీ హౌస్‌లో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ వెదురు వర్క్‌షాప్‌నకు పట్టణ ఉపాధ్యాయులు మురళీకృష్ణ ఎంపికయ్యారు. నాణ్యమైన వెదురు సాగు, వెదురు ఉత్పత్తుల తయారీ, చిన్న, సూక్ష్మ, మధ్యతరగతి పరిశ్రమల ద్వారా మార్కెటింగ్ సదుపాయాలు, బ్రాండింగ్ విధానం, విదేశాలకు ఎగుమతికి సంబంధించిన అనేక అంశాలపై నిపుణులు వివరించనున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఆరుగురు సభ్యుల బృందాన్ని ఢిల్లీకి పంపుతునట్లు మురళీకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ ఎంపికపై జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్, జిల్లా విద్యాధికారి రవీందర్, పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

వడ్డెర సంఘం నూతన కమిటీ ఎన్నిక

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని వడ్డెర సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు జరపటి ఈశ్వర్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ కమిటీని ఎనుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీని ఏర్పాటు చేశారు. పట్టణ అధ్యక్షుడు వడ్డె నరేష్, అధ్యక్షుడు వడ్డె రమేష్, కోశాధికారి రాము, జనరల్ సెక్రెటరీ శేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రమేష్, అంజి, సభ్యులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా అంబులెన్స్

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ఎదుట రోజులుగా నిరుపయోగంగా అంబులెన్స్ ఉంది. చిన్నంబావి, వీపనగండ్ల ఉమ్మడి మండలాలకు అంబులెన్స్ వసతి లేకపోవడంతో కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి బీరం ఫౌండేషన్ ద్వారా అంబులెన్స్ కోసం అవసరమైన వాహనాన్ని అందజేశారు. వాహన నిర్వహణకు అవసరమయ్యే డబ్బులు లేవన్న కారణంతో అధికారులు వాహనాన్ని వినియోగించడం లేదు. దీంతో మెరుగైన వైద్యం కోసం ఉమ్మడి మండలాల్లోని 40గ్రామాల ప్రజలు జిల్లా ఆస్పత్రికి వెళ్లేందుకు ఎన్నో ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంబులెన్స్ వాహనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



పీహెచ్‌సీలో నిరుపయోగంగా ఉన్న అంబులెన్స్

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

ఆత్మకూర్: రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం చిన్నచింతకుంట మండలం ఉంద్యాల గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ దయాకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ సుజాత దంపతులు ద్విచక్రవాహనంపై ఆత్మకూర్‌కు వెళ్తున్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఎదుట పందులు అడ్డురావడంతో వీటిని తప్పించేక్రమంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ఘటనలో దంపతులకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

అ'పూర్వ' సమ్మేళనం



నాటి గురువులతో పూర్వవిద్యార్థులు

ఆత్మకూర్: మండలంలోని తిప్డంపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002–03 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ వారంతా ఒకచోట కలుసుకోవడంతో పూర్వ విద్యార్థులు సంబురపడ్డారు. అప్పట్లో చదివిన తరగతి గదుల్లో జరిగిన చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులు రాఘవరెడ్డి, శంకర్‌గౌడ్, నర్సింహాచారి, చక్రవర్తిగౌడ్, కల్పలత, కురుమూర్తి, మల్లప్ప, సత్యం, వెంకటేశ్వర్లులను ఘనంగా స్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం విద్యార్థుల సౌకర్యార్థం రూ. 30వేలు వెచ్చించి ప్యూరిఫైడ్ ఫిల్టర్‌వాటర్ మిషన్‌ను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తులసిరాజ్, నరేష్, రవి, సోమన్న, శ్రీనివాస్, బాలరాజు, జ్యోతి, గౌసియా, స్వాతి, బుచ్చన్న పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా చెరుకు తరలిస్తే చర్యలు

ఆత్మకూర్: ఇష్టానుసారంగా చెరుకును తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై పుట్ట మహేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమయపాలన పాటించకుండా ట్రాక్టర్ల ద్వారా చెరుకును తరలించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే జరిమానా విధిస్తామన్నారు. రాత్రి 8–30 గంటల తర్వాతనే ఆత్మకూర్ మీదుగా చెరుకును తరలించాలని లేనిపక్షంలో రూ.2వేలు జరిమానా విధించి ట్రాక్టర్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

నీటి వృథాను అరికట్టండి



ట్యాంక్ నుంచి వృథాగా పోతున్న తాగునీరు

అమరచింత: పట్టణంలోని మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంకుల నుంచి ఓవర్‌ఫ్లో కారణంగా తాగునీరు వృథాగా పోతోంది. గంటల తరబడి నీరు వృథాగా వెళ్లడంతో రోడ్లపై పారుతోంది. ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొన్నారు. స్థానిక జెడ్పీఉన్నత పాఠశాల, దశమికట్ట వద్ద ఉన్న వాటర్ ట్యాంకుల నుంచి నిత్యం నీరు వృథాగా పోతోందని పలువురు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకొని నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

'ప్రజావాణి'కి అధికారులు హాజరుకావాలి

కోడేరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి మండల స్థాయి అధికారులు హాజరు కావాలని తహసీల్దార్ మల్లికార్జున్ రావు కోరారు. ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.

కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా జహంగీర్

కొల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడిగా జహంగీర్ నియమితులయ్యారు. ఈమేరకు ఆయనకు నియోజకవర్గ నాయకులు చింతలపల్లి జగదీశ్వర్ రావు, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్‌లు నియామక ఉత్తర్వులు అందజేశారు. ముస్లిం, మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ పాష, రాముయాదవ్, పరశురాంనాయుడు, కాంతారావు, బాలపీరు పాల్గొన్నారు.

ధ్వంసమైన సాగునీటి కాల్వల పరిశీలన

పాన్‌గల్: మండల శాగాపూర్ శివారులోని రాజాపూర్ గ్రామం దగ్గర కేఎల్ఐ డీ8 కాల్వను ధ్వంసం చేసి మేజర్ –6 కాల్వకు సాగునీరు రాకుండా అడ్డుకట్ట వేసిన ప్రాంతాన్ని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్యయాదవ్‌లు రైతులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాల్వను ధ్వంసం చేసి అడ్డుకట్ట వేయడంతో మండలంలోని శాగాపూర్, మాధరావుపల్లి, దావాత్‌ఖాన్‌పల్లి, ఆకునోనిపల్లితో పాటు కోడేర్ మండలం రేకులపల్లి, రేకులపల్లితండా, మొండితండా, ఓప్పితండా గ్రామాలకు సాగునీరు నిలిచిందన్నారు. వెంటనే మరమ్మతు పనులు చేసి చివరి ఆయకట్టుకు సాగునీరు అందిచాలని ఇరిగేషన్ ఏఈ వెంకటేష్‌ను కోరారు. దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు హలీమ్, బీఆర్ఎస్ నాయకులు గురువయ్య, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



ధ్వంసం చేసిన కాల్వను పరిశీలిస్తున్న ఎంపీపీ, రైతులు

పట్టణాభివృద్ధిలో భాగస్వాములవుదాం



భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ

పెబ్బేరు: పట్టణాభివృద్ధిలో భాగస్వాములవుదామని మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని 5వ వార్డులో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కరుణశ్రీ మాట్లాడుతూ వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి కృషితో టీయూఎఫ్ఐడీసీ నిధుల నుంచి రూ.15 లక్షల వ్యయంతో సీసీ రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రె స్వామి, గోపిబాబు, రామకృష్ణనాయుడు, ఏఈ రమేష్‌నాయుడు, నాయకులు సాయినాథ్, సత్యనారాయణ, వేణుయాదవ్, నాగిరెడ్డి, రమేష్‌గౌడ్, మన్నెం, సాయులు, స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలి'

కొత్తకోట: రైతులకు, సామాన్య ప్రజలకు మాయ మాటలు చెప్పి రెండు పర్యాయాలు అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధం కావాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్యయాదవ్ అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు 24గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని మోసం చేసిందన్నారు. నిరుద్యోగులకు రూ.3వేలు నిరుద్యోగ భృతి అంటిరి, ఇంటింటికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నాయకుల అవినీతికి వ్యతిరేకంగా, రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 10న రైతుల పక్షాన మండల కార్యాలయాల ఎదుట దీక్ష చేస్తామన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కె.వెంకట్రామిరెడ్డి, బీచుపల్లియాదవ్, జ్ఞానేశ్వర్, కొండారెడ్డి, మండ్లరాములు, జమ్ములయ్య, రవి, కృష్ణయ్యయాదవ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజన్నయాదవ్

గడువు ముగిసినా విక్రయాలు

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గడువు ముగిసినా తినుబండారాలను కిరాణ విక్రయదారులు విక్రయిస్తున్నారు. మండల కేంద్రంలోని కిరాణదారులు నిషేధిత గుట్కాలను సైతం గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పిల్లలకు విక్రయించే తినుబండారాలు గత సంవత్సరంలోనే గడువు ముగిసినా నేటికి విక్రయిస్తున్నారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సమీపంలో ఉన్న దుకాణదారులు గడువు ముగిసిన తినుబండారాలను పిల్లలకు ఇస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గడువు ముగిసిన తినుబండారాలు

డివైడర్‌కు మరమ్మతు చేపట్టండి



అమరచింత: పట్టణంలోని పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్ డివైడర్‌ను నాలుగురోజుల కిందట గుర్తు తెలియని వాహనం ఢీ కొన్నది. దీంతో డివైడర్ దెబ్బతిన్నది. సంవత్సరం కిందట డివైడర్ నిర్మించారని నాణ్యత లేకుండా నిర్మించారని స్థానికులు ఆరోపించారు. దెబ్బతిన్న డివైడర్‌కు వెంటనే మరమ్మతు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించేవారిని ఎమ్మెల్సీగా గెలిపించండి

కొల్లాపూర్: శాసనమండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని ఎమ్మెల్సీగా గెలిపించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రంగినేని అభిలాష్‌రావు కోరారు. ఆదివారం ఆయన కొల్లాపూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు. హర్షవర్ధన్‌రెడ్డికి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసిన అనుభవం ఉందని, సమస్యలపై పూర్తిస్థాయి అవగాహన ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వస్తే 317 జీఓ బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. సీపీఎస్ రద్దు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు పరమేష్, కంటె శివన్న, రఫియోద్దీన్, బాబా, బీరయ్యయాదవ్, నర్సింహయాదవ్, తగిలి కృష్ణ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రంగినేని అభిలాష్‌రావు

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని దేశి ఇటిక్యాలలో నూతనంగా నిర్మించిన కలెక్టరేట్ ఎస్పీ కార్యాలయాలలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాలను ఆ భవనాలు నిర్మించేందుకు భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ, కలెక్టరేట్ కార్యాలయాల నిర్మాణం కోసం ఎస్సీ, బీసీల తమ భూములను ఇచ్చారని, వారికి నామమాత్రంగా పరిహారం చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భూములు కోల్పోవడంతో కనీసం జీవన ఉపాధి కరువైందని, చాలా మంది వలస వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో ఆ భవనాలను ప్రారంభించనుండడంతో భూ నిర్వాసిత కుటుంబాల్లోని అర్హత కలిగిన వారికి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పరుశురాములు, శ్రీనివాస్, బాలరాజు, ఆంజనేయులు, రాము పాల్గొన్నారు.



భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్న సీపీఎం నాయకులు